కథా నిలయం
శ్రీకాకుళం



# చంద్ర తెలిసిన కథే

ఆ రోజు నరసమ్మకి దేవుడు వచ్చిపోయేడు.

* * *

నరసమ్మకి నలభయ్యేళ్ళు.

ఇన్నేళ్ళుగా ఆ పేటలోనే తన గుడిసెలోనే బతుకుతూ వొచ్చింది.

ఆమెకి పదమూడో యేటనే పెళ్ళయ్యింది.

అతని పేరు రాజయ్య.

రిక్షా తొక్కేవాడు.

ఇద్దరు ముగ్గురు పిల్లలు పుట్టేక ఓ రోజు లారీకింద పడి రిక్షా పోయింది. మనిషీ పోయేడు.

తాగి హారను కొడుతున్నా లారీ కిందకు వొచ్చేడని లారీ యజమాని దెబ్బలాడేడు.

ఆ మాటే డబ్బిచ్చి కోర్టులో చెప్పించేడు.

తాగి రిక్షా తొక్కేడు గనక రిక్షా యజమాని నరసమ్మని రిక్షా డబ్బులు కట్టమన్నాడు.

అంత డబ్బు నరసమ్మ లేదు గనక పెళ్ళప్పుడు తల్లి పెట్టిన ఒకే ఒక్క గొలుసు తగలేసి ఇంటి అరుగుమీద కొట్టెట్టింది.

ఆ కొట్టుమీదే పిల్లల్ని పెంచింది.

రిక్షా అసలు తీర్చింది.

వడ్డీకింద మరో ఐదారు వందలు తీర్చాల్సుంది.

పెద్ద కొడుకు, ఇరవైఏళ్ళవాడు తమ గుడిసెని అప్పుకిందకు రిక్షా యజమానికి తీర్చేడు.

నరసమ్మ ఏడ్చింది. మొత్తుకుంది.

నరసమ్మ కొడుక్కి రిక్షా యజమాని తొక్కడానికి ఓ రిక్షా నిచ్చేడు.

ఇల్లు పోతే పోయింది కొట్టు తనకిందే వుండనీయమన్నది నరసమ్మ.

నరసమ్మకి న్యాయం జరగలేదు.

భూమి గుండ్రంగానే వుంది. అదింకా తిరుగుతూనే వుంది.

నరసమ్మకి దేవుడు వచ్చిపోయేడు.

కథ చదవటం పూర్తిచేసేడు చంద్ర.

వింటున్నవాళ్ళ మొహాలు చూస్తే తెలుస్తూనే వుంది—ఎవరికీ నచ్చలేదని.

"ఇది నువు రాసిందే" విశ్వం కోపంగా అన్నాడు.

చంద్ర మాట్లాడలేదు.

"ఈ కథని బ్రహ్మాండంగా రాయొచ్చు. ఎందుకని రాయలేదు" అని వెంకట్రామయ్య అన్నాడు.

"రాయొచ్చు. నిజం చెప్పండి. అందర్లా శైలీ గత్రాతో భాషా చమక్కులతో సాగదీసి రాయమంటారా? నిజానికి ఏ కథనయినా ఇప్పుడీ కథలాగే మూడు ముక్కల్లో చెప్పుకోలేమా?" రచయిత అనేవాడు ఏ కథనయినా, ఏ థీమ్‌నయినా తన యాంగిల్‌లోనే కదా చెప్పేది. ఇందులో నేను చెప్పలేదంటారా?" అన్నాడు చంద్ర.

"చెప్పలేదని కాదు. నువ్వన్నట్టు ప్రతి కథని మూడు మాటల్లో చెప్పుకోవచ్చు. మరైతే యింక కథలెందుకు? రాయటమెందుకూ? కథలన్నాక, శాస్త్రకారుడు శిల్పం, శైలీ అంటూ కొన్ని ఏడిశాడు. అందువల్ల మన వాటిని అనుకరించకతప్పదు." అన్నాడు విశ్వం.

"నేనొప్పుకోను. శిల్పం, శైలీ ఒక రచయిత తాలూకు వ్యక్తిగతమైన ప్రతిభని చూపించేవి. నియోరియలిజంలో సినిమా డైరెక్టర్స్ చేస్తున్న పనే నేనీ కథలో చేసాను. ఈ పది వాక్యాల కథలో కారెక్టర్స్, సబ్జెక్ట్, ఎట్మాస్ఫియర్, సిచ్యువేషన్స్ కనిపించలేదనండీ—ఇది రాయటంలో నేను ఫెయిల్ అయ్యానని ఒప్పుకుంటాను."

"అది కాదు చంద్రా! నువ్వన్నట్టుగానే ఆలోచిద్దాం—నియోరియలిజం అన్నావు. సహజత్వాన్ని చూపించేందుకు ప్రతి విషయాన్నీ కాళీపట్నం రామారావుగార్లా రాయకపోయినా పాత్రల్నీ, పాత్రల తాలూకు గుణగణాల్నీ, సంఘటనల్నీ, వాతావరణాన్నీ కనీసం టచ్ చేసి రాసివున్నా ఈ కథకి ఎఫెక్ట్ రాదంటావా? కథ చదివాక దాని తాలూకు ప్రభావం మంచో. చెడో ఏదో ఒకటి పాఠకుడిమీద కలిగి తీరాలని ఒప్పుకుంటావు గదా. ఇప్పుడీ కథవల్ల అది సాధిస్తున్నావా?" అన్నాడు వెంకట్రామయ్య.

"ఈ కథలో నేన్రాసిన పాత్రల్నీ, సంఘటనల్నీ, పరిస్థితుల్నీ ఊహించలేని పాఠకులయితే నా కనవసరం. పాఠకులకి తెలీని ప్రపంచాన్నీ, న్యాయాన్నీ, పాత్రల్నీ నేనిందులో రాయలేదు. ఐయామ్ ష్యూర్ ది రీడర్స్ కెన్ ఇమాజిన్! అందువల్ల ఈ కథ ఫెల్యూర్ అంటే నేనొప్పుకోను."

***